



నేటి ఉదయం

తెలుగు దినపత్రిక



ప్రచురణ : విజయనగరం | శనివారం 07-11-2026 | చీఫ్ ఎడిటర్ : కె వి ఎల్ ఎస్ బాలసుబ్రహ్మణ్యం | సంపుటి : 1 | సంచిక : 107 | పేజీలు : 4 | వెల : 2.00



ఏపీ ప్రభుత్వ పనితీరుపై కేంద్ర బృందం ప్రశంసలు

ఉదయం ప్రతినిధి – అమరావతి

'అర్నబ్', 'మురసు' జంట తుఫాన్‌ల విపత్తు నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్కార్ సేవలు భేష్‌గా నిలిచాయని కేంద్ర బృందం ప్రశంసలు కురిపించింది. తుఫాన్‌లపై సకాలంలో బాధితులకు అందించిన సేవలకు గానూ రాష్ట్ర ప్రభుత్వ తీరును కేంద్ర బృందం అభినందించింది. అయితే, 'అర్నబ్', 'మురసు' జంట తుఫాన్‌లు ఒకే వారంలో విరుచుకుపడటంతో 20 జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపించాయి. 120 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులు.. ప్రకృతి బీభత్సాన్ని దీటుగా ఏపీ ప్రభుత్వం ఎదుర్కొంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికత, ముందస్తు వ్యూహాలతో పెనుముప్పు తప్పింది.. ఆపదలో రాష్ట్రాన్ని సురక్షిత నాయకత్వం ఆదుకుంది. విపత్తు నిర్వహణలో దేశానికే ఆదర్శంగా ఏపీ నిలించింది. తుఫాన్‌ల ప్రభావంతో కనిష్ఠ స్థాయికి ఆస్తి, ప్రాణనష్టం వచ్చింది. ప్రాణ రక్షణ కవచాల్లాగా రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ, ఆర్టీజీఎస్ అధికారులు పనిచేశారు. కంట్రోల్ రూమ్ నుంచి 24/7 తుఫాన్‌ల పర్యవేక్షణ.. కచ్చితమైన అంచనాలతో యంత్రాంగం అప్రమత్తమైంది. ఏఐ, శాటిలైట్ సమాచారంతో ఫోన్లకు హెచ్చరికలను ఏపీ సర్కార్ జారీ చేసింది. 'మనమిత్ర' వాట్సాప్ యాప్‌తో సత్వర సహాయం అందజేసింది. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీసు శాఖల సమన్వయం ద్వారా లక్షలాది మంది సురక్షిత ప్రాంతాలకు తరలించింది. పునరావాస కేంద్రాల్లో బాధితులకు సర్కార్ అండగా నిలిచింది. నిరంతరాయంగా ఆహారం, తాగునీరు, వైద్యం అందజేసింది. రికార్డు వ్యవధిలో రాకపోకలను పునరుద్ధరించింది. అధికారుల సమష్టి కృషితో వేగంగా సాధారణ స్థితికి జనజీవనం వచ్చింది.

23న డిప్యూటీ మేయర్ ఎన్నిక



ఉదయం ప్రతినిధి –విజయనగరం

ఈనెల 23వ తేదీన విజయనగరం నగర పాలక సంస్థలో డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఎన్నికకు సంబంధించి ఏర్పాటు చేయాల్సిన ప్రత్యేక కౌన్సిల్ సమావేశం నిర్వహించేందుకు ఈనెల 18వ తేదీలోగా నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది. ఈ ఎన్నిక నిర్వహణకు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కు అధికారం కల్పించింది. జిల్లా కలెక్టర్ గాని, సంబంధిత ఎన్నికల అథారిటీ ద్వారా అధికారం పొందిన జాయింట్ కలెక్టర్ గాని ఈ నోటీసును జారీ చేయాల్సి ఉంటుంది. నగర మేయర్, ఎన్నికైన సభ్యులు, ఎక్స్ -అఫీషియో సభ్యులకు నోటీసులు అందజేస్తారు. అనంతరం 23వ తేదీ ఉదయం 11 గంటలకు డిప్యూటీ మేయర్ ఎన్నికను పరోక్ష పద్ధతిలో నిర్వహిస్తారు. ఈమేరకు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి పర్యవేక్షణలో నగర పాలక సంస్థ సహాయ ఎన్నికల అధికారి కమిషనర్ బి బాలస్వామి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏదైనా కారణంతో 23వ తేదీన డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహణ సాధ్యం కాకపోతే 24వ తేదీన నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశించింది.

తుఫాన్ బాధితులకు అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు : సీఎం చంద్రబాబు



ఉదయం ప్రతినిధి – బాపట్ల

తుఫాన్ బాధితులకు అండగా ఉంటామని, అధైర్యపడ వద్దని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భరోసా కల్పించారు. బాపట్ల జిల్లాలోని మురసు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం సీఎం పర్యటించారు. బాపట్ల జిల్లాలోని జిల్లెళమూడిలో నీట మునిగిన వరి పంటను ముఖ్యమంత్రి పరిశీలించారు. నీట మునిగి పంట నష్టపోయిన రైతులతో సీఎం మాట్లాడి ధైర్యం చెప్పారు. పంటలపై అన్నదాతలు ఎంతమేర పెట్టుబడులు పెట్టారని అడిగి తెలుసుకున్నారు. కరవు పరిస్థితుల్లో కూడా కూటమి ప్రభుత్వం నీరు ఇచ్చి పంటలను ఆదుకుందని ముఖ్యమంత్రికి రైతులు తెలిపారు. పంట చేతికి వచ్చే సమయంలో తుఫాన్ దెబ్బ తీసిందంటూ ఆవేదనతో సీఎంకు పరిస్థితిని రైతన్నలు వివరించారు. పంటల బీమా చేయించుకున్నారా అని అన్నదాతలను ముఖ్యమంత్రి అడిగారు. ప్రకృతి విపత్తుల సమయంలో పంట బీమాతో పాటు ప్రభుత్వం ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ రైతులను ఆదుకుంటుందని చెప్పారు. పంటలకు బీమా చేయించుకుంటే కలిగే ప్రయోజనాలపై పెద్దఎత్తున అవగాహన కల్పిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు.

పరిషత్ ఓట్ల లెక్కింపు నేడే

- శనివారం ఉదయం 8 నుంచి ప్రారంభం
- నాలుగు నియోజకవర్గాల్లోని 15 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు

ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం మరియు పోలీసు శాఖ సమగ్ర ప్రణాళికతో పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేశాయి. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా ఎన్ ప్రభాకర రెడ్డి పర్యవేక్షణలో కౌంటింగ్ నిర్వహణకు సిద్ధమైంది. నవంబర్ 7న జరగనున్న ఈ ఓట్ల లెక్కింపు కోసం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఉన్న 15 మండలాలకు సంబంధించి వేర్వేరు ప్రాంతాల్లో 15 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 15 జెడ్పీటీసీ స్థానాలతో పాటు 226 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు జరగనుంది.

నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపుకేంద్రాల వివరాలు

పార్వతీపురం నియోజకవర్గానికి సంబంధించి పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాల ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగునుంది. పాలకొండ నియోజకవర్గానికి సంబంధించి పాలకొండ, వీరఘట్టం, భామిని, సీతంపేట మండలాల ఓట్ల లెక్కింపు కార్యక్రమం పాలకొండ డిగ్రీ కళాశాల ఫస్ట్ బ్లాక్లో జరగనుంది. సాలూరు నియోజకవర్గానికి సంబంధించి సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రభుత్వ డిగ్రీ డ పీజీ కళాశాలలో జరగనున్నది. కురుపాం నియోజకవర్గానికి సంబంధించి కురుపాం, జి ఎల్ పురం, జిఎం వలస, గరుగుబిల్లి, కొమరాడ మండలాల ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఉల్లి భద్ర దరి ఉద్యాన కళాశాలలో జరుగనున్నది

భారీ పోలీసు భద్రత – బందోబస్తు

కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లా పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తును రంగంలోకి దించింది. నాలుగు నియోజకవర్గాల స్థాయి కౌంటింగ్ కేంద్రాల వద్ద 382 మంది పోలీస్సు విధులు నిర్వహిస్తున్నారు. 04 డీఎస్పీలు, 16 మంది సీఐ/ఆర్ఐ లు, 20 మంది ఎస్ఐలు, 219 మంది కానిస్టేబుళ్లు, మరియు 123 హోం గార్డ్ సిబ్బందిని నియమించారు. కౌంటింగ్ కేంద్రాల పరిధిలోని సంబంధిత పోలీసు స్టేషన్ల ద్వారా మూడంచెల భద్రతా చర్యలు చేపడుతున్నారు. అధికారులు మరియు సిబ్బంది సమన్వయంతో శనివారం ఉదయం నుంచే బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధమయ్యాయి.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఓట్ల లెక్కింపు విజయవంతం చేయాలి

- కౌంటింగ్‌లో పొరపాట్లకు తావివ్వొద్దు
- వేగంగా, కచ్చితత్వంతో ఓట్ల లెక్కింపు చేపట్టాలి
- కౌంటింగ్ సకాలంలో పూర్తి చేయడం కీలకం: కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి



ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్‌ను విజయవంతంగా నిర్వహించినట్లుగానే ఓట్ల లెక్కింపు ప్రక్రియను కూడా విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. ఎన్. ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్దిష్ట సమయంలో పూర్తి చేయడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి అనుభవాన్ని ఒక పాఠంగా తీసుకొని, కౌంటింగ్ ప్రక్రియను పకడ్బందీగా, వేగవంతంగా నిర్వహించాలని సూచించారు. రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు మినహా ఇతర సిబ్బంది ఎవరూ సెల్ ఫోన్లు వినియోగించరాదని స్పష్టం చేశారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు రిజర్వ్ సిబ్బంది అందుబాటులో ఉండాలని, అవసరమైన సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా కచ్చితత్వంతో విధులు నిర్వహించాలని, ప్రక్రియ సజావుగా, వేగంగా పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ప్రశాంతమైన, పారదర్శకమైన వాతావరణంలో కౌంటింగ్ పూర్తయ్యేలా చూడాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్ వైశాలి, పాలకొండ, పార్వతీపురం సబ్ కలెక్టర్లు పవర్ స్వప్నిల్ జగన్నాథ్, సచిన్ ఆర్చిత రహోర్, డీఆర్ఓ కె. హేమలత, జెడ్పీ సీఈఓ సుధాకర్, డీజీపీఓ, మున్సిపల్ కమిషనర్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

గజపతినగరంలో కూటమి నాయకులు, కార్యకర్తల సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కృతజ్ఞతలు



ఉదయం ప్రతినిధి – గజపతినగరం


గజపతినగరం నియోజకవర్గం టిడిపి పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్థానిక ఎన్నికల్లో కష్టపడిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ సమిష్టిగా, అంకితభావంతో పనిచేశారని మంత్రి కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, ఆయన నాయకత్వంలో ప్రతి కార్యకర్త గ్రామగ్రామాన తిరిగి కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారని తెలిపారు. స్థానిక ఎన్నికలకు సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి అందరం కలిసి పనిచేద్దామని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి ఏఎంసీ చైర్మన్ గోపాల్ రాజు మండల స్థాయి నాయకులు కూటమి నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు..

విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి.. నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి!

- శివన్నపేట గురుకులంలో జ్వరాల పరిస్థితిపై మంత్రి అచ్చెన్నాయుడు ఆరా
- విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి.. అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి ఆదేశం

ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం శివన్నపేటలోని ఏపిటిడబ్ల్యూఆర్ఎస్, యుఆర్జేసీ గురుకుల వసతి పాఠశాలలో విద్యార్థులకు జ్వరాలు, జలుబు, దగ్గు లక్షణాలు కనిపించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అప్రమత్తమయ్యారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. జ్వర లక్షణాలతో బాధపడుతున్న విద్యార్థులకు తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. గురుకుల పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం కొనసాగించాలని, వైద్య నిపుణులతో విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అనారోగ్యంతో ఉన్న విద్యార్థులను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ, ఇతర విద్యార్థులకు ఇన్ఫెక్షన్లు వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీటి నాణ్యత, ఆహార పదార్థాల స్వచ్ఛత, వంటశాల పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జ్వరాల వ్యాప్తికి గల కారణాలను గుర్తించేందుకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, నివేదికల ఆధారంగా తగిన చర్యలు చేపట్టాలన్నారు. శివన్నపేట గురుకులంలోనే కాకుండా జిల్లావ్యాప్తంగా అన్ని గురుకుల, సంక్షేమ వసతి పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఎక్కడైనా జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే స్పందించి వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ



అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు దిశానిర్దేశం చేశారు. విద్యార్థుల ఆరోగ్య భద్రత విషయంలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించరాదని, పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు వైద్య బృందాలు నిరంతరం అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు తల్లిదండ్రుల్లో ఆందోళన తొలగించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

దళిత ఉద్యమనేత కీ.శే. బసవ సూర్యనారాయణకు నివాళులు అర్పించిన జిల్లా ఎస్పీ



ఉదయం ప్రతినిధి – విజయనగరం

దళిత ఉద్యమనేత, ప్రజా హక్కుల పోరాట యోధులు కీ.శే.లు బసవ సూర్యనారాయణ గారి పార్థివ దేహాన్ని విజయనగరం జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ పట్టణం కనపాకలోని ఆయన స్వగృహం నందు సందర్శించి, పార్థివ దేహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు.కీ.శే.లు బసవ సూర్యనారాయణ కుటుంబ సభ్యులతో జిల్లా ఎస్పీ దామోదర్ కాసేపు మాట్లాడి, వారికి ధైర్యం చెప్పి, కీ.శే.లు బసవతో తనకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.బడుగు, బలహీన వర్గాల ప్రజలకు బసవ అండగా నిలబడి, వారికి నిస్వార్థంగా సేవలందించే వారని ఆయన సేవలను జిల్లా ఎస్పీ దామోదర్ కొనియాడి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.బసవ మరణం దళిత వర్గానికి తీరని లోటని డివిఎంసి సభ్యులు పి.చిట్టిబా బు అన్నారు.ఈ కార్యక్రమంలో డివిఎంసి సభ్యులు పి.చిట్టిబాబు,డిబి ఎస్ యూ రాష్ట్ర కార్యదర్శి కే.సిహెచ్.బంగార్రాజు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు ఎం.చంద్రరావు, నక్కా సూరప్పడు, బి.అప్పన్న, డి డబ్ల్యూ ఎఫ్ జిల్లా కార్యదర్శి కోరుకొండ వరలక్ష్మి, తదితరులు పాల్గొని, సూర్యనారాయణ గార్కి శ్రద్ధాంజలి ఘటించారు.

టీడబ్ల్యుఏజీహెచ్ఎస్ ఉలిపిరి వసతి గృహాన్ని సందర్శించిన జిల్లా వ్యాధి నిరోధక అధికారి డాక్టర్ విజయమోహన్



ఉదయం ప్రతినిధి – కొమరాడ

కొమరాడ మండలంలో ఉన్న ఉలిపిరి టీడబ్ల్యుఏజీహెచ్ఎస్ వసతి గృహాన్ని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ విజయమోహన్ సందర్శించారు. వసతి గృహంలో ఇద్దరు విద్యార్థులు అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యం లో జిల్లా అధికారి పర్యవేక్షణలో వైద్యాధికారి డాక్టర్ పి. అనూప్ , జనూ. ఆర్. బంగారుబాబు , ఎంఎల్హెచ్పీ మరియు ఏఎన్ఎం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు వచ్చిన జ్వరాలు ప్రస్తుతం నియంత్ర ణలో ఉన్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా టీడబ్ల్యుఏజీహెచ్ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ రామ లింగం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి జిల్లా అధికారి కి వివరించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ విజయమోహన్ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, విద్యార్థులకు మరియు వసతి గృహ వార్డెన్కు ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, జ్వరాల నివారణకు సంబంధించి పలు వైద్య సూచ నలు, సలహాలు అందజేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

ఏపీలో మరో నేషనల్ హైవే విస్తరణ

కడప టు రేణిగుంట గ్రీన్ఫీల్డ్ హైవే

ఉదయం ప్రతినిధి – కడప

ఆంధ్రప్రదేశ్లో నేషనల్ హైవేలు, రోడ్లపై కేంద్రం ఫోకస్ పెట్టింది.. కేంద్రం సహకారంతో హైవే విస్తరణ ప్రాజెక్టుల్ని చేపట్టారు. కడప టు చెన్నై హైవేలో కొన్నేళ్లుగా వాహనాల రద్దీ పెరిగింది. రైల్వేకోడూరు నుంచి రేణిగుంట వరకు దాదాపు 50 కిలోమీటర్ల రోడ్డు దెబ్బతింది. శేషాచలం అడవి, ప్రమాదకర మలుపులు ఉండటంతో ప్రమాదాలు జరిగేవి. అందుకే కడప టు చెన్నై హైవేను రెండు వరసలు నుంచి నాలుగు వరుసలుగా విస్తరించాలని ఐదేళ్ల క్రితం నిర్ణయించింది. అయితే పనులు మాత్రం ప్రారంభంకాలేదు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఎన్హెచ్-716లో కడప- రేణిగుంట సెక్షన్ గ్రీన్ఫీల్డ్ హైవేగా నిర్మిస్తున్నారు. మొత్తం122 కిలోమీటర్లకు గాను అంచనా వ్యయం రూ. 2,254 కోట్లుగా ఉంది.కేంద్రం నేషనల్ హైవే 716కి అనుసంధానంగా కడప నుంచి రేణిగుంట గ్రీన్ఫీల్డ్ హైవేకి ప్లాన్ చేసింది. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ తగ్గించొచ్చని భావించారు. కడప, భాకరాపేట, ఒంటిమిట్ట, రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు, మామండూరు మీదుగా రేణిగుంట వరకు నాలుగు లైన్లుగా హైవేను నిర్మిస్తోంది. ప్రస్తుతం ఈ రోడ్డులో కడప నుంచి రేణిగుంట వెళ్లేందుకు నాలుగు గంటల సమయం పడుతోంది. ఈ హైవే విస్తరణ పూర్తయితే కేవలం రెండు గంటల్లో వెళ్లొచ్చుంటున్నారు. అలాగే వాహనాల రద్దీ తగ్గి ప్రమాదాల సంఖ్య కూడా తగ్గుతుందని భావిస్తున్నారు. అలాగే ప్రజా రవాణాతో పాటుగా వ్యవసాయ, వాణిజ్య రంగాలకు ఉపయోగంగా ఉంటుందంటున్నరు.2021లోనే కేంద్రం ఈ గ్రీన్ఫీల్డ్ హైవే విస్తరణకు గ్రీన్సిగ్నల్ ఇచ్చింది.. 2024 వరకు అసలు పనులు ప్రారంభించలేదు. కేంద్రంతో సంప్రదింపులు జరపకపోవడంతో పాటుగా అటవీశాఖ అనుమతులు రావడంలేదన్న కారణాలతో పనులు పక్కన పెట్టారు. 2024 జూన్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2025 అక్టోబరులో పనులు ప్రారంభించారు.. రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయాలన్న టార్గెట్ పెట్టుకున్నారు. అటవీ శాఖ అనుమతులతో పాటుగా నిధుల విడుదల, భూసేకరణ, పరిహారం పంపిణీ పూర్తి చేశారు. ప్రస్తుతం కడప జిల్లాలో పనులు స్పీడ్ అందుకున్నాయి. అలాగే రైల్వేకోడూరు నుంచి రేణిగుంట వరకు అటవీ భూమిలో చెట్ల తొలగింపు కొనసాగుతోంది. ఈ హైవే అందుబాటులోకి వస్తే తిరుపతి, చెన్నై వెళ్లేవారికి కూడా ఎంతో ఉపయోగంగా ఉంటుంది. కడప నుంచి రేణిగుంటకు.. అక్కడి నుంచి తిరుపతికి రెండున్నర గంటల్లోనే వెళ్లొచ్చన్నారు. మొత్తానికి 2027 నాటికి ఈ గ్రీన్ఫీల్డ్ హైవే పనుల్ని పూర్తి చే?యలనే లక్ష్యంతో పనుల్ని మరింత వేగవంతం చేశారు.


అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడే.. జెడ్పీటీసీకి త్రిముఖ పోటీ

ఉదయం ప్రతినిధి – చీపురుపల్లి

మండలంలో శుక్రవారం జరిగే జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల ఎన్నికల కౌంటింగ్ లో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. గరివిడి ఎస్ డిఎస్ కళాశాలలో జరిగే ఓట్ల లెక్కింపునకు సంబంధించి అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలో 49,469 మంది ఓటర్లకు గాను 37,989 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఒక జెడ్పీటీసీ స్థానానికి ముగ్గురు అభ్యర్థులు పోటీపడుతున్నారు. టీడీపీ నుంచి వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, వైసీపీ నుంచి బెల్లాన వంశీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నుంచి నాగులపల్లి పైడిరాజు పోటీలో ఉన్నారు. 18 ఎంపీటీసీ స్థానాలకు 40 మంది అభ్యర్థులు టీడీపీ, జనసేన, వైసీపీ, స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు. చీపురుపల్లి 1 అభ్యర్థిగా ఇజ్జిరోతు నిహారిక (టీడీపీ), వైసీపీ నుంచి మహంతి లక్ష్మీ, చీపురుపల్లి 2 రేగాన శాంతి ప్రియ (టీడీపీ), సబ్బి సోనియా (స్వతంత్ర టీడీపీ రెబల్ అభ్యర్థి), అడ్డూరి కృష్ణారావు (వైసీపీ), చీపురుపల్లి 3 మీసాల కాశీ విశ్వేశ్వరరావు (టీడీపీ), ముల్లు పైడిరాజు (వైసీపీ), చీపురుపల్లి 4 నుంచి గవిడి నాగరాజు (టీడీపీ), ఇప్పిలి అనంతం (వైసీపీ), వంగపల్లి పేటలో వెంపడాపు హైమవతి (టీడీపీ), వెంపడాపు వెంకటరత్నం (వైసీపీ), చీపురుపల్లి 6 నుంచి కోట్ల కృష్ణ (జనసేన), కోసిరెడ్డి రమణ (వైసీపీ), రామలింగాపురం సారిక రామారావు



(టీడీపీ), ఇప్పిలి వెంకట నర్సమ్మ (వైసీపీ), కర్లం నుంచి బాణాన రమణ (వైసీపీ), పొన్నాడ మహేశ్వరరావు (టీడీపీ), పేరిపి లో కోరాడ కోటేశ్వరరావు (టీడీపీ), లెంక రాజారావు (వైసీపీ), కరకాం నుంచి దన్నాన పద్మావతి (టీడీపీ), మీసాల వెంకటరమణ (వైసీపీ), నిమ్మలవలసలో పినిపిల్లి సుజాత (టీడీపీ), పెంట ముగతమ్మ (వైసీపీ), రావివలస నుంచి శనపతి నవ్య (టీడీపీ), కొమ్ము పద్మజ (వైసీపీ), ఇటకర్లపల్లి లో పాండ్రంకి కళావతి (టీడీపీ), రెడ్డి శాంతమ్మ (వైసీపీ), పెదనడిపల్లిలో సప్ప లక్ష్మీ (టీడీపీ), ఇప్పిలి గౌరీదేవి




(వైసీపీ), అలజంగి లో శనపతి శ్రీదేవి (టీడీపీ), మీసాల జ్యోతి (వైసీపీ), మెట్టపల్లి లో వెంపడాపు రాజేశ్వరి (టీడీపీ), మీసాల శారద (వైసీపీ), జనసేన నుంచి పీకే పాలవలస లో బైరెడ్డి మణికంఠ, బైరెడ్డి తవుడమ్మ (వైసీపీ), గొల్లల మూలగాం లో చందక దుర్గా భవాని (టీడీపీ), కరిమజ్జి పద్మ (వైసీపీ), స్వతంత్ర్య అభ్యర్థులుగా నిమ్మలవలస నుంచి అలికాన ధనలక్ష్మి, కర్లం నుంచి దుగ్గ రామకృష్ణ, ఇటకర్లపల్లి నుంచి పాండ్రంకి మంగమ్మ, కరకం నుంచి మంత్రి సత్యనారాయణ లు పోటీలో ఉన్నారు.

ఏపీలో పెండింగ్ మున్సిపల్ ఎన్నికలపై ఫోకస్

ఉదయం ప్రతినిధి – విజయవాడ

ఆంధ్రప్రదేశ్లో పెండింగ్లో ఉన్న మిగిలిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఎన్నికల నిర్వహణకు రాజ్ఞ సిద్ధమవుతోంది. ఇప్పటికే మేయర్, ఛైర్పర్సన్, డిజవిన్లు, వార్డులకు సంబంధించి రిజర్వేష న్లు ఖరారు చేశారు. ఈ నెల10 నుంచి 12 మధ్య ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఈ నెల 25లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఏపీ హైకోర్టులో కొన్ని కార్పొ రేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సంబం ధించి కేసులు పెండింగ్ ఉన్నాయి. అందుకే అక్టోబర్ 14న జారీ చేసిన ఎన్నికల నోటిఫికేషన్లో ప్రస్తావన లేదు.ఏపీ హైకోర్టులో కేసులు పరిష్కారం కావడంతో ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే డివిజన్లు/వార్డుల పునర్విభజన, ఓటర్ల జాబి తాల తయారీ పూర్తి చేశారు. అలాగే మిగిలిన ప్రక్రియను కూడా పూర్తి చేశారు. ఇటీవల రిజర్వేషన్లు కూడా ఖరారు



చేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం సమాచారం అందించింది. కార్పొరేషన్లలో మేయర్ పదవులకు సంబంధించి.. శ్రీకాకుళం (జనరల్ మహిళ), రాజమహేంద్రవరం (ఎస్సీ జనరల్), కాకినాడ(బీసీ మహిళ),మంగళగిరి-తాడేపల్లి (ఎస్టీ జనరల్)కి రిజర్వ్ అయ్యాయి.ఈ నాలుగు కార్పొరేషన్లకు సంబంధించి 260 డివిజన్లలో 90 స్థానాలు బీసీలకు రిజర్వ్ చేశారు. ఎస్సీలకు 35, ఎస్టీలకు 5, మహిళలకు 68, అన్ రిజర్వ్డ్ కింద 62 ఉన్నాయి. ఆముదాలవలస, రాజాం, భీమవరం, తాడేపల్లిగూడెం, చింతలపూడి, పాలకొల్లు, తణుకు, బి.కొత్తపేట, గుడివాడ, నరసరావుపేట, పొన్నూరు, తాడిగడప, బాపట్ల,పొదిలి, కందుకూరు, అల్లూరు, గూడూరు, కావలి, శ్రీకాళహస్తి మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఛైర్పర్సన్ స్థానాలకు ఎన్నికల నిర్వహించనున్నారు. వీటిలోని 749 వార్డులకూ రిజర్వేషన్లు ఖరారయ్యాయి. వార్డుల్లో బీసీలకు 231, జనరల్ మహిళకు 202, ఎస్సీలకు 106,ఎస్టీలకు 36, రిజర్వ్ అయ్యాయి. మిగిలిన వార్డులు 174 వార్డులు అన్ రిజర్వ్డ్ అయ్యాయి. మొత్తం మీద స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ డిసెంబర్ మొదటి వారంలో పూర్తికానున్నాయి. అయితే మధ్యలో సుప్రీం కోర్టు తీర్పు, తుఫాన్ కారణంగా కొంత ఇబ్బందులు ఎదురైనా సరే ప్రక్రియ సాఫీగానే సాగిపోయింది.

తండ్రి బాటలో వంగవీటి రాధా

ఉదయం ప్రతినిధి – విజయవాడ

విజయవాడ రాజకీయాల్లో వంగవీటి కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఒకప్పుడు కార్పొరేటర్గా మొద లైన ఆ కుటుంబ రాజకీయ ప్రస్థానం.. ఎమ్మెల్యే పదవి మీదుగా ఇప్పుడు నగర మేయర్ పీఠం వరకు చేరింది. తండ్రి వంగవీటి మోహన రంగా రాజకీయాల్లో సంపా దించుకున్న గుర్తింపును కొనసాగిస్తూ ఆయన కుమా రుడు వంగవీటి రాధాకృష్ణ మరో కీలక విజయాన్ని అం దుకున్నారు. 25 ఏళ్ల వయసులోనే ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన.. ఇప్పుడు 47 ఏళ్లకు విజయవాడ మేయర్ ఎన్ని కల్లో విజయం సాధించారు. జనసేన అభ్యర్థిగా బరిలోకి దిగిన రాధా.. వైసీపీ అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మిపై 1,30,912 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కాంగ్రెస్, వామపక్షాల మద్దతుతో పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థి ఏబీ వెంకటేశ్వరరావుకు 12,642 ఓట్లు వచ్చాయి. వంగవీటి రాధాకృష్ణ రాజకీయాల్లోకి రావడానికి ముందే ఆయన కుటుంబానికి విజయవాడలో బలమైన రాజకీయ పునాది ఉంది. తండ్రి మోహన రంగా 1985 లో విజయవాడ తూర్పు నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన హత్య అనంతరం రాజకీయాల్లోకి వచ్చిన తల్లి రత్నకుమారి కూడా అదే నియోజకవర్గం నుంచి 1989, 1994 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించారు. అయితే 1999 ఎన్నికల నాటికి రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. టీడీపీలో చేరిన రత్నకుమారికి ఆ ఎన్నికల్లో టికెట్ దక్కలేదు. ఆమె స్థానంలో బరిలోకి దిగిన సినీ నటుడు కోట శ్రీని వాసరావు విజయం సాధించారు. ఈ పరిణామాల తర్వా త వంగవీటి కుటుంబ రాజకీయ వారసత్వాన్ని కొన సాగించేందుకు రాధాకృష్ణ సిద్ధమయ్యారు. 2003 చివర్లో రాధాకృష్ణ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. డిసెంబర్




26న మోహన రంగా వర్ధంతి సందర్భంగా విజయవాడ లో నిర్వహించిన సభలో అప్పటి పీసీసీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్, కాంగ్రెస్ నేత దాసరి నారాయణరావు సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.మరుసటి ఏడాదే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయవాడ తూర్పు నుంచి పోటీ చేసి గెలిచారు. అప్పటికి ఆయన వయసు కేవలం 25 ఏళ్లు. చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా అసెం బ్లీలో అడుగుపెట్టడం రాధాకృష్ణ రాజకీయ జీవితంలో తొలి పెద్ద మైలురాయిగా నిలిచింది.ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత రాధాకృష్ణ రాజకీయ ప్రయాణం ఒకే పార్టీలో సాగలేదు. 2008లో చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో చేరారు. 2009 ఎన్నికల్లో విజయవాడ సెంట్రల్ నుంచి పోటీ చేసినా విజయం దక్కలేదు. తర్వాత 2012లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014 ఎన్నికల్లో విజయవాడ తూర్పు నుంచి మరోసారి అదృష్టం పరీక్షించుకున్నప్పటికీ ఓటమి ఎదురైంది. 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన ఆయన.. ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉంటూ పార్టీ స్టార్ క్యాం పెయినర్గా వ్యవహరించారు. 2024 ఎన్నికల సమ యంలోనూ కూటమి అభ్యర్థుల తరఫున ప్రచారం చేశా రు. ఈ క్రమంలో ఆయనకు ఎమ్మెల్సీ పదవి దక్కవచ్చని, మంత్రి పదవి కూడా రావచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. కానీ చివరకు ఆయన రాజకీయ ప్రయాణం మరో మలుపు తిరిగిందిటీడీపీలో సుమారు ఏడేళ్లు కొనసాగిన రాధాకృష్ణ.. విజయవాడ స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు జనసేనలో చేరారు. కూటమి తరఫున జనసేన అభ్యర్థిగా మేయర్ ఎన్నికల్లో పోటీకి దిగారు. ఈసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి వచ్చిన ఆయన భారీ మెజారిటీతో విజయం సాధించారు. దీంతో ఎమ్మెల్యేగా మొదలైన ఆయన ఎన్నికల ప్రస్థానంలో మరో కీలక ఘట్టం చేరింది.వంగవీటి కుటుంబానికి విజయవాడ నగర రాజకీయాలతో ఉన్న అనుబంధం ఈ విజయంతో మరోసారి తెరపైకి వచ్చింది. 1981లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో మోహన రంగా కృష్ణలంకలోని 40వ డివిజన్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కార్పొరేటర్గా గెలిచారు. అప్పటికి ఆయన ఓ హత్య కేసులో జైలులో ఉన్నప్పటికీ ఎన్నికల్లో విజయం సాధించడం అప్పట్లో ప్రత్యేకంగా నిలిచింది. కార్పొరేటర్గా మొదలైన మోహన రంగా రాజకీయ ప్రస్థానం తర్వాత ఎమ్మెల్యే స్థాయికి చేరింది. ఇప్పుడు అదే నగరంలో ఆయన కుమారుడు మేయర్ ఎన్నికల్లో గెలుపొందారు. తండ్రి నగర కార్పొరేటర్గా పనిచేసిన చోట కుమారుడు మేయర్ పీఠాన్ని దక్కించుకోవడం ఈ కథనంలో మరో ఆసక్తికరమైన అంశం.1979లో కృష్ణా జిల్లా పెనమలూరులో జన్మించిన రాధాకృష్ణ.. గుంటూరులో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. అనంతరం తమిళనాడులోని సేలంలో వినాయక మిషన్స్ మెడికల్ కాలేజీలో మెడిసిన్ చదివేందుకు చేరారు. అయితే వైద్య విద్యను మధ్యలోనే వదిలేసి రాజకీయాల వైపు అడుగులు వేశారు. అలా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రయాణం ఇప్పుడు విజయవాడ మేయర్ ఎన్నికల్లో విజయంతో మరో మైలురాయిని చేరుకుంది.

వైసీపీ అంతర్గత పోరే ముంచిందా...?

ఉదయం ప్రతినిధి – నెల్లూరు

రాజకీయాల్లో నెల్లూరు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ముఖ్యంగా రాజకీయంగా బలమైన నాయకులు, రెడ్డి సామాజిక వర్గం ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతంగా నెల్లూరుకు పేరుంది. ఒకప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా కనిపించిన ఈ ప్రాంతంలో ఇప్పు డు పరిస్థితులు పూర్తిగా మారినట్లు ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా జరిగిన నెల్లూరు నగరపా లక సంస్థ ఎన్నికల్లో కూటమి సాధించిన ఘనవిజయం వైసీపీకి గట్టి హెచ్చరికగా మారింది. పార్టీకి బలమైన నాయకత్వం ఉన్నప్పటికీ ఓటర్లను ఆకట్టుకోవడంలో ఎందుకు విఫలమైందనే చర్చ రాజకీయ వర్గాల్లో మొద లైంది. నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలను పరిశీ లిస్తే కూటమి ఆధిపత్యం ఎంత బలంగా ఉందో అర్థమ వుతుంది. మొత్తం 72 డివిజన్లలో టీడీపీ(41 స్థానాలను గెలుచుకుంది. బీజేపీ ఆరు, జనసేన మూడు స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఎన్నికల ప్రక్రియ పూర్తికాకముం దే ఎనిమిది డివిజన్లు కూటమి ఖాతాలో ఏకగ్రీవంగా చేరడం కూడా ఆ పార్టీకి కలిసొచ్చింది. మిగిలిన స్థానా ల్లోనూ కూటమి అభ్యర్థులు మెజారిటీ విజయాలను నమోదు చేయడంతో కార్పొరేషన్పై పట్టు సాధించారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పోలుబోయిన రూప్కుమార్ యాదవ్ మేయర్గా ఘన విజయం సాధించడం మరో కీలక పరిణామం. వైసీపీ అభ్యర్థి ఆనం విజయకుమార్ రెడ్డిపై ఆయన 80,170 ఓట్ల భారీ మెజారిటీ సాధించ డం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల వ్యక్తిగత బలం, స్థానిక సమస్యలు, పార్టీ కేడర్ పనితీరు కీలకంగా ఉంటాయి. ఈ అన్ని అంశాల్లో కూటమి వైసీపీ కంటే మెరుగైన వ్యూహంతో ముందుకు వెళ్లినట్లు ఫలి తాలు సూచిస్తున్నాయి. నెల్లూరులో వైసీపీకి నాయకుల కొరత లేదు. మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్తో పాటు పలు వురు సీనియర్ నాయకులు పార్టీకి అండుబాటులో ఉన్నా రు. అయినప్పటికీ ఎన్నికల సమయంలో వీరంతా సమన్వయంతో పనిచేయలేకపోయారనే విమర్శలు విని పిస్తున్నాయి. నాయకుల మధ్య విభేదాలు, స్థానిక స్థాయి లో ఆధిపత్య పోరు పార్టీ విజయావకాశాలను దెబ్బతీసి నట్లు రాజకీయ విశ్లేషణలు సాగుతున్నాయి.మరోవైపు కూటమి అభ్యర్థుల విజయానికి వైసీపీలోని కొందరు నాయకుల సహకారం కూడా కారణమైందనే ప్రచారం తెరపైకి వచ్చింది. రూప్కుమార్ యాదవ్తో కొందరు నేతలు ముందుగానే సన్నిహితంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రచారంలో వాస్తవమెంత అనేది స్పష్టత రావాల్సి ఉంది. ఎన్నికల ఫలితాల ఆధారంగా మాత్రమే ఇలాంటి ఆరోపణలను నిర్ధారించలేం.నెల్లూరు కార్పొరేషన్తో పాటు ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాలెం, వెంకటగిరి, సూళ్లూరుపేట వంటి మున్సిపాలిటీల్లోనూ కూటమి మంచి ఫలితాలు సాధించ డం వైసీపీకి మరో ఎదురుదెబ్బగా మారింది. మొత్తానికి నెల్లూరులో వైసీపీ ఓటమిని కేవలం ప్రత్యర్థుల బలంతో మాత్రమే చూడలేం. నాయకుల మధ్య సమన్వయం,



పార్టీ కేడర్ చురుకుదనం, ప్రజల్లో విశ్వాసం వంటి అంశాలు కూడా ప్రభావం చూపుతాయి. ఇప్పటికైనా అంతర్గత విభేదాలను పరిష్కరించి నాయకులందరినీ ఒకే దారిలో నడిపించకపోతే ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి ఫలితాలు పునరావృతమయ్యే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గుమ్మడి సంధ్యారాణికి డేంజర్ బెల్స్

ఉదయం ప్రతినిధి – విజయనగరం



మంత్రిగా ఉండి కూటమి ఆదేశాలను ధిక్కరించడం ఈ ఎన్నికల్లో హైలెట్ అనే చెప్పాలి. కూటమి నిర్ణయించిన అభ్యర్థులను కాకుండా తన సొంత అనుచరులకు పదవులను కట్టబెట్టాలన్న మంత్రిగారి తపన కూటమిలోని ప్రధాన పార్టీ అయిన టీడీపీకి తలనొప్పిగా మారింది. గుమ్మడి సంధ్యారాణి వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కూటమి పొత్తును ధిక్కరించడంతో పాటు తమ అనుచరులను రెబల్ గా దించి ఏదో సాధిద్దామని భావించి చతికలపడుతున్నారు.ఇక విషయానికి వస్తే కూటమి పొత్తుని దిక్కరించి, రాష్ట్ర స్తాయి సర్దుబాటులో జనసేనకి ఇచ్చిన సాలూరు మున్సిపాలిటీని జనసేనకి వదలకుండా టీడీపి నుండి రెబల్ ని దింపి, ప్రచారం కూడా చేసారు. ఎక్కడా పొత్తు దర్మాన్ని పాటించకుండా వార్డుల్లో కూడా జనసేన మీద పోటీ పెట్టారు. ఇది గుమ్మడి సంధ్యారాణికి అవమానంగానే చూడాలి. తొలిసారి ఎమ్మెల్యే అయి, తొలిసారి మంత్రి పదవి లక్కుతో పొంది పార్టీ నాయకత్వం ఆదేశాలను ధిక్కరించడాన్ని పలువురు మిత్ర పక్ష పార్టీ నేతలు తప్పుపడుతున్నారు సాలూరు నియోజకవర్గానికి గుమ్మడి సంధ్యారాణి తొలిసారి గెలిచారు. ఒకరకంగా చెప్పాలంటే సాలూరు నియోజకవర్గంలో టీడీపీకి పట్టులేదు. కూటమి హవాలో గెలిచారు. గతంలో రెండుసార్లు పోటీ చేసి ఓటమి పాలయిన గుమ్మడి సంధ్యారాణి గాలి వాటంలో గెలిచారు. తనకున్న సామాజికవర్గం కారణంగా ఎమ్మెల్సీ పదవిని అంతకు ముందు పొందారు. టీడీపీకి నమ్మకమైన నేతగా నిలిచినప్పటికీ గుమ్మడి సంధ్యారాణి మున్సిపల్ ఎన్నికల్లో సాలూరు మున్సిపాలిటీలో రెబల్ ను బరిలోకి దించి తమ పార్టీ నేతలకే సవాల్ విసిరారు. కానీ మంత్రి గారి చర్యలను కూటమి పార్టీల కార్యకర్తలు సమర్థించలేదు. కూటమిలో పొత్తులో భాగంగా అది జనసేనకు కేటాయించారు. కానీ తన అనుచరుడి కోసం రెబల్ గా దించి తప్పు చేశారంటూ సొంత పార్టీ నేతలే మంత్రిగారి మీద కారాలు, మిరి?యలు నూరుతున్నారు. మరొకవైపు జనసేన నేతలు కూడా ఇప్పటకే మంత్రి గుమ్మడి సంధ్యారాణిపై తమ పార్టీ నాయకత్వానికి ఫిర్యాదు చేశారు.... అయితే జనసేన అభ్యర్థి గెలవడంతో ఇక గుమ్మడి సంధ్యారాణి సీన్ చెప్పకనే తెలిసిపోయిందంటున్నారు. ఇక మున్సిపల్ ఎన్నికలతో ఊరుకోని గుమ్మడి సంధ్యారాణి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ తన మద్దతుదారులను రెబల్ గా బరిలోకి దింపారు. జనసేన కు దక్కాల్సిన వాటాను తాము దక్కించుకుని క్రెడిట్ కొట్టేయాలనుకున్న మంత్రి గారి ఆలోచన రివర్స్ అయిందనే అనుకోవాలి. కూటమిలోని టీడీపీ నాయకత్వం కూడా గుమ్మడి సంధ్యారాణిపై చర్యలు తీసుకోకపోవడం ఒకింత జనసైనికులకు ఆగ్రహాన్ని తెప్పించింది. సాలూరులో వరసగా కాంగ్రెస్, వైసీపీలు మూడు ఎన్నికల్లో గెలిచాయి. కానీ మొన్న గాలివాటాన గెలిచిన గుమ్మడి సంధ్యారాణి మాత్రం తాను ఏదో పెద్ద లీడర్ అని పోజులివ్వడం మాత్రం సొంత పార్టీ నేతలకే నచ్చడం లేదు. ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే గుమ్మడికి మంత్రి పదవి ఊడటం ఖాయమన్న కామెంట్స్ కూటమి పార్టీల నేతల నుంచి వినిపిస్తుంది.

ఒడిశాలో ఎక్సైజ్ శాఖ అంతర్రాష్ట్ర దాడులు

3,400 లీటర్ల బెల్లపు ఊటలు, 50 లీటర్ల నాటుసారా ధ్వంసం



ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

నాటుసారా తయారీ, అక్రమ రవాణా కట్టడే లక్ష్యంగా నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఎక్సైజ్ అధికారులు ఒడిశా రాష్ట్రంలో అంతర్రాష్ట్ర దాడులు నిర్వహించినట్లు పార్వతీపురం ఎక్సైజ్ సీఐ నరసింహమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోరాపుట్ జిల్లా బందుగాం బ్లాక్ పరిధిలోని బోత్రపల్లి, తీకరపాడు గ్రామాల్లో ఒడిశా ఎక్సైజ్ పోలీసుల సహకారంతో శుక్రవారం ఈ తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో 3,400 లీటర్ల బెల్లపు ఊటలు, 50 లీటర్ల నాటుసారాను గుర్తించి ధ్వంసం చేశారు. అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఏ. సంతోష్, విజయనగరం ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎం. వి. గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో పార్వతీపురం, సీతానగరం ఎక్సైజ్ స్టేషన్ల సిబ్బంది, పార్వతీపురం ఈఎస్‌టీఎఫ్, విజయనగరం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు పాల్గొన్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో నాటుసారా తయారీ, విక్రయాలపై నిఘా కొనసాగిస్తామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.


భీమవరానికి వరద ముప్పు.. ఉధృతంగా ప్రవహిస్తోన్న యనమదుర్రు డ్రైన్



ఉదయం ప్రతినిధి – భీమవరం

జిల్లాలోని భీమవరానికి వరద ముప్పు పొంచి ఉంది. భారీ వర్షాల కారణంగా భీమవరం వద్ద యనమదుర్రు డ్రైన్ ఉధృతంగా ప్రవహిస్తోంది. యనమదుర్రు డ్రైన్ ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో డ్రైనేజీలు నుంచి వరద నీరు వెనక్కి ఎగదన్నుతున్న పరిస్థితి. దీంతో పల్లపు ప్రాంతాల్లో వరద నీరు నిలిచిపోయింది. యనమదుర్రు వరద ప్రవాహం నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే రెండవ ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. యనమదుర్రు డ్రైన్ ఉధృతి పెరిగి ఇళ్లలోకి నీరు చేరుతుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. పల్లపు ప్రాంతాలలోని వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. మరోవైపు పాలకొడేరు వద్ద గోస్తని నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పాలకోడేరు సబ్‌స్టేషన్‌లోకి వరద నీరు వచ్చి చేరింది.

విద్యార్థిని గోపిక కుడిచేయి శస్త్రచికిత్స సక్సెస్: మంత్రి సవిత




ఉదయం ప్రతినిధి – అనంతపురం

అనంతపురం జిల్లా రాప్తాడు ఉన్మాది దాడిలో గాయపడ్డ విద్యార్థిని గోపిక కోలుకుంటోందని ఆంధ్రప్రదేశ్ మంత్రి సవిత పేర్కొన్నారు. మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోపికను మంత్రి శుక్రవారం పరామర్శించారు. తనకు మెరుగైన వైద్యం అందించడంలో ప్రత్యేకంగా కృషి చేసిన మంత్రి లోకేశ్‌కు గోపిక కృతజ్ఞతలు తెలిపారని అన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి సవిత మాట్లాడారు. తనకు మెరుగైన వైద్యం అందుతోందని గోపిక సంతోషం వ్యక్తం చేసిందని తెలిపారు. మంత్రి లోకేశ్.. గోపిక ఆరోగ్యం గురించి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. తనను కాపాడిన స్నేహితురాలు ఎలా ఉందని గోపిక అడిగారని మంత్రి చెప్పుకొచ్చారు. గోపిక కుడిచేయి శస్త్రచికిత్స చేశారని, ఆపరేషన్ సక్సెస్ అయిందని వైద్యులు చెప్పారని అన్నారు. మంత్రి లోకేశ్.. గోపికను సొంత బిడ్డలాగా భావించి నిరంతరం ఆమె ఆరోగ్యం గురించి పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ అధికారులను ఆస్పత్రి వద్ద ఉంచి వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు.

జగన్ నైజం ఏంటో ప్రజలకు బాగా తెలుసు..

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయం చేయాల్సిన చోట చేయాలని మంత్రి సవిత హితవు పలికారు. జగన్ నైజం ఏంటో ప్రజలకు బాగా తెలుసు అని చెప్పారు. ప్రజలంతా నిందితుడిని హతమార్చాలని కోరుకుంటుంటే... వైసీపీ కాపాడాలని చూస్తోందని ధ్వజమెత్తారు. నిందితుడు హేమంత్‌ను కాపాడేందుకు న్యాయస్థానంలో పిల్ వేశారని చెప్పారు. చట్టం చేయాల్సిన పని చేస్తోందని.. పోలీసులపై అతను దాడి చేయడంతోనే కాల్పులు జరిపారని మంత్రి సవిత పేర్కొన్నారు.

పదే పదే అవమానించడంతోనే వైసీపీ నుంచి బయటకు వచ్చా: విజయసాయిరెడ్డి



ఉదయం ప్రతినిధి – తాడేపల్లి

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి (సంచలన వ్యాఖ్యలు చేశారు. జగన్‌ను తానుగా వదలివెళ్లలేదని, ఆ పార్టీ నుంచి తనను బయటకు గెంటేశారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తాడేపల్లిలో మీడియాతో విజయసాయిరెడ్డి మాట్లాడారు. ఉద్దేశపూర్వకంగా పొమ్మనకుండా పొగబెట్టి, పదే పదే అవమానించడం వల్లే తాను బయటకు రావాల్సి వచ్చిందని తెలిపారు. సుమారు 70కు పైగా ఆయా ఘటనల్లో తనను అవమానించారని, ఇక భరించలేనటువంటి పరిస్థితుల్లోనే వైసీపీకి రాజీనామా చేయాలని నిర్ణయం తీసుకున్నానని పేర్కొన్నారు.

వైఎస్ ఏనాడూ అవమానించలేదు.. : దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కానీ, ఆయన తండ్రి రాజారెడ్డి కానీ తనను ఏనాడూ అవమానించలేదని విజయసాయిరెడ్డి వ్యాఖ్యానించారు. కేవలం జగన్ రెడ్డి పాలనలోనే, ఇతరులు చెప్పే మాటలు విని తనను అవమానించారని అన్నారు. జగన్ కూడా అప్పుడప్పుడు తనను అవమానించారని చెప్పారు. ఎవరూ ఇన్ని అవమానాలు భరించకూడదన్నారు. స్థానిక ఎన్నికల్లో గుంటూరు, ప్రకాశం, అనంతపురం సహా రాయలసీమ జిల్లాల్లో జరిగిన ఘటనలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటివని చెప్పుకొచ్చారు.

నా పార్టీలో ప్రతి ఒక్కరికీ ఆత్మగౌరవం.. : అలాగే, నూతన పార్టీ ఏర్పాట్లపై విజయసాయిరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈనెల 11వ తేదీన తమ పార్టీ ఆవిర్భావానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. అన్నివర్గాలకు చెందిన నేతలు తమ పార్టీలోకి వస్తున్నారని పేర్కొన్నారు. కొత్తగా తాను పెట్టబోయే పార్టీలో ప్రతి ఒక్కరికీ ఆత్మగౌరవం ఉంటుందని, అందరికీ సముచిత స్థానం కల్పిస్తామని మాటిచ్చారు. కొత్త పార్టీని పూర్తిగా ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. తమ పార్టీలో మరో ఇద్దరు నేతలు చేరారని ప్రకటించారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు సుమతిరెడ్డి, దళిత సంఘాల నేత బోణి గణేశ్ తమ పార్టీలో చేరారని చెప్పుకొచ్చారు. రాష్ట్రాన్ని రెండు కుటుంబాల చేతుల్లోనే పెట్టకూడదని అన్నారు. తమ పార్టీలో యువతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని మాటిచ్చారు. నిరంకుశత్వ పాలన చేయకుండా తమ పార్టీ విధానం ఉంటుందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో చాలామంది తమ పార్టీలోకి రాబోతున్నారని తెలిపారు. రాష్ట్రంలో మూడో ప్రత్యామ్నాయంగా తమ పార్టీ ఎదగబోతుందని విజయసాయిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యార్థుల జ్వరాలపై ఆందోళన చెందొద్దు.. మెరుగైన వైద్యం అందిస్తాం: మంత్రి సత్యకుమార్

ఉదయం ప్రతినిధి – పార్వతీపురం మన్యం జిల్లా

పార్వతీపురం మన్యం జిల్లా శివన్నపేట గురుకులంలో విద్యార్థుల జ్వరాలపై ఆంధ్రప్రదేశ్ మంత్రి సత్యకుమార్ ఆరా తీశారు. శుక్రవారం హెల్త్ డైరెక్టర్, జిల్లా అధికారులతో మాట్లాడిన మంత్రి.. గురుకులంలో పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని వెల్లడించారు. గురుకులంలో మొత్తం 71 మందికి జ్వరాలు రాగా.. ఇప్పటికే 30 మంది విద్యార్థులు పూర్తిగా కోలుకున్నట్లు సమాచారం ఉందని తెలిపారు. 516 మంది విద్యార్థులకు ర్యాపిడ్ పరీక్షలు చేయగా.. కేవలం ఒకరికి మాత్రమే మలేరియా పాజిటివ్, మిగతా అందరికీ నెగెటివ్ వచ్చిందని చెప్పుకొచ్చారు.

ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశాం..

ప్రస్తుతం 38 మందిని ప్రత్యేకంగా వైద్యుల సంరక్షణలో ఉంచినట్లు మంత్రి వివరించారు. కురుపాం సీహెచ్‌సీలో మరో ముగ్గురు విద్యార్థులకు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల కోసం గురుకులంలో జనరల్ మెడిసిన్, పిల్లల వైద్య నిపుణులతో ప్రత్యేకంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామని అన్నారు. విద్యార్థులకు సోకినవి తుఫాన్ అనంతర వైరల్ జ్వరాలేనని వైద్య నిపుణులు ప్రాథమిక అంచనా వేశారని తెలిపారు.

అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలి..

44 మంది విద్యార్థులకు రక్తపరీక్షలు చేయగా ఫలితాలు సాధారణంగా వచ్చాయని.. ల్యాబ్‌కు విద్యార్థుల రక్త నమూనాలు చేరాయని వెల్లడించారు. పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు మూడు తాగునీటి వనరుల నమూనాలను పంపినట్లు మంత్రికి అధికారులు వివరించారు. జ్వర లక్షణాలు సాధారణ స్థాయిలోనే ఉన్నాయని.. అయినా



అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని మంత్రి సత్యకుమార్ ఆదేశాలు జారీ చేశారు.

జగన్ ఓటు వేయలేదు.. వైసీపీకి పోటీ చేసే సత్తా లేదు

ఎమ్మెల్సీ, నెల్లూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీద రవిచంద్ర

ఉదయం ప్రతినిధి – నెల్లూరు



వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఎమ్మెల్సీ, నెల్లూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీద రవిచంద్ర తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతగా చెప్పుకునే ప్రతిపక్ష హోదాలేని వైసీపీ అధ్యక్షుడు జగన్.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు వేయలేదన్నారు. పోటీచేసే సత్తాలేక.. వైసీపీ నేతలు తప్పులతో నామినేషన్లు వేశారని విమర్శించారు. దమ్ము, ధైర్యం లేక పారిపోయి తమపై విమర్శలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. కూటమి పార్టీలతోనే అభివృద్ధి, సంక్షేమమని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. అందుకే స్థానిక సంస్థలు ఎన్నికల్లో కూటమి పార్టీల నేతలకు ప్రజలు మద్దతు ఇస్తున్నారని చెప్పారు. మున్సిపాల్టీల కంటే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఫలితాలు సాధించబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఒన్ మినిట్ వీడియోలతో సోషల్ మీడియాలో విషప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్సీ మండిపడ్డారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, మంత్రి నారాయణపై లేనిపోని విమర్శలు చేశారని... ఆయా డివిజన్లలో ఎవరు గెలిచారని ప్రశ్నించారు. 'పెట్రోల్ బాంబులు ఎవరు వేశారు. కత్తులతో తరిమింది ఎవరు' అంటూ నిలదీశారు. వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి స్వయంగా కారుతో టీడీపీ కార్యకర్తలని చంపేయబోయారని... ఆ సమయంలో ఎదురు తిరగరా అంటూ నిలదీశారు. వైసీపీ చెప్పే అబద్ధాలను ప్రజలు ఎవరూ నమ్మలేదని.. కూటమి నేతల నాయకత్వాన్ని నమ్మారని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పేర్కొన్నారు.

శరవేగంగా కుంభమేళ పనులు

ఉదయం ప్రతినిధి – భోపాల్

దేశంలో ప్రయాగ్‌రాజ్, హరిద్వార్, ఉజ్జయిని వంటి ప్రాంతాల్లో కుంభమేళా జరుగుతుండగా.. నాసిక్ కుంభ మేళాకు ప్రత్యేకత ఉంది. ఇది నాసిక్‌తో పాటు త్రయంబ కేశ్వర్‌లోనూ నిర్వహిస్తారు. 1838లో త్రయంబకేశ్వర్‌లో శైవ, వైష్ణవ సాధువుల మధ్య స్నానాల ప్రాధాన్యత విష యంలో ఘర్షణలు జరగడంతో అఖాడాలను వేర్వేరు ప్రాంతాలకు తరలించారు. అప్పటి నుంచి శైవ సాధు వులు త్రయంబకేశ్వర్‌లోని కుశావర్త తీర్థం వద్ద.. వైష్ణవ అఖాడాలు నాసిక్‌లోని రామ్‌కుండ్, తపోవన్ ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించే సంప్రదాయం కొనసాగు తోంది. వచ్చే ఏడాది 3 ప్రధాన అమృత స్నానాలు జరగ నున్నాయి. 2027 ఆగస్ట్ 2, ఆగస్ట్ 31, సెప్టెంబర్ 11వ తేదీల్లో జరగనున్నాయి. వీటితో పాటు నాసిక్‌లో 45, త్రయంబకేశ్వర్‌లో 29 శుభస్నాన తేదీల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2027 కుంభమేళా కోసం చేపట్టిన అభివృద్ధి పనులు కేవలం తాత్కాలిక ఏర్పాట్లకే పరిమితం కావడం లేదు. మొత్తం 350కిపైగా ప్రాజెక్టులు చేపట్టగా.. వాటిలో దాదాపు 85 శాతం శాశ్వత మౌలిక సదుపాయాలుగా నిర్మిస్తున్నారు. కుంభమేళా ముగిసిన తర్వాత కూడా నాసిక్, త్రయంబకేశ్వర్ ప్రాంతాల ప్రజలకు ఇవి ఉప యోగపడేలా ప్రణాళికలు రూపొందించారు. కుంభమేళా తో పోలిస్తే ఈసారి మౌలిక సదుపాయాల కోసం పెట్టే వ్యయం దాదాపు 10 రెట్లు అధికమని కుంభమేళా మంత్రి గిరీశ్ మహాజన్ తెలిపారు. 2027 వేడుకలను పరిశుభ్రంగా, సురక్షితంగా, సమర్థంగా నిర్వహించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గత కుంభమేళా ఎలాంటి ప్రాణనష్టం లేకుండా ప్రశాంతంగా ముగిసిన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రవాణా వ్యవస్థను విస్తరించడంపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా దాదాపు 150 కిలోమీటర్ల మేర రహదారులను విస్తరించి, ఆధునికీకరిస్తున్నారు. గోదావరి, దాని ఉపనదులపై కొత్తగా 8 వంతెనలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కుంభమేళా సమయంలో భారీగా తరలివచ్చే భక్తుల రాకపోకలను సులభతరం చేయడం వీటి ప్రధాన ఉద్దేశం. ఇక నాసిక్ నగర ట్రాఫిక్ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం చూపేలా 65.6 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డును నిర్మించను న్నారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.7,613 కోట్ల వ్యయం అంచనా వేశారు. రింగ్ రోడ్డు పూర్తి అయితే నగరంలోకి వచ్చే వాహనాల రద్దీ తగ్గడంతో పాటు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని భావిస్తు న్నారు. కుంభమేళాలో పవిత్ర స్నానాలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. ఈ నేపథ్యంలో నాసిక్‌లో గోదావరి నది వెంట సుమారు 3.4 కిలోమీటర్ల పొడ వున కొత్త ఘాట్లను నిర్మిస్తున్నారు. త్రయంబకేశ్వర్‌లోనూ అదనపు స్నాన ఘాట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటు న్నారు. చారిత్రక ఆలయాలు, కుండాలను పునరుద్ధరిస్తు న్నారు. త్రయంబకేశ్వర్ ఆలయ పట్టణాన్ని అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'శివ దర్శన్ పథ్' ప్రాజెక్టును చేపట్టారు. దీనివల్ల ఆల యానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిం చడంతో పాటు, ఆ ప్రాంత పర్యాటక ప్రాధాన్యత కూడా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.కోట్లాది మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించే గోదావరి నది పరిశుభ్రత ఈ కుంభమేళాలో అత్యంత కీలకమైన అంశం. నదిలోకి శుద్ధి చేయని మురుగునీరు చేరకుండా అడ్డుకునేందుకు నాసిక్‌లో భారీ మురుగునీటి నిర్వహణ ప్రాజెక్టును చేపట్టారు. ఇందులో భాగంగా 4 ఆధునిక మురుగునీటి శుద్ధి కేంద్రాలు, దాదాపు 200 కిలోమీ టర్ల పొడవున మురుగునీటి పైప్‌లైన్లు నిర్మిస్తున్నారు. ఈ పనుల్లో సగానికిపైగా ఇప్పటికే పూర్తి అయ్యాయని నాసిక్ మున్సిపల్ కమిషనర్ మనీషా ఖాత్రీ తెలిపారు. కుంభమేళా ప్రారంభానికి ముందే మిగిలిన పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే నాసిక్ నగరంలో మురుగునీటి నిర్వహణ వ్యవస్థ మెరు గుపడటంతో పాటు గోదావరి కాలుష్యాన్ని నియంత్రిం చేందుకు దోహదపడతాయి.మహారాష్ట్రలో ఈ ఏడాది బలహీనమైన రుతుపవనాల కారణంగా పలు ప్రాంతాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో లక్షలాది, కోట్లాది మంది భక్తులకు అవసరమైన నీటిని అందించడం, స్థానిక ప్రజల అవసరాలను కూడా సమ తుల్యం చేయడం అధికారులకు సవాలుగా మారనుంది. ముఖ్యంగా పుణ్యస్నానాల కోసం గోదావరిలో తగినంత నీటి లభ్యత ఉండేలా ముందస్తు ప్రణాళికలు అవసరం. భక్తుల అవసరాలు, నగరాల రోజువారీ నీటి అవసరాల మధ్య సమన్వయం సాధిస్తామని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న మౌలిక సదు పాయాలు కుంభమేళా ముగిసిన తర్వాత కూడా కనీసం 30 ఏళ్లపాటు ఈ ప్రాంతానికి ఉపయోగపడతాయని నాసిక్-త్రయంబకేశ్వర్ కుంభమేళా అథారిటీ కమిషనర్ శేఖర్ సింగ్ వెల్లడించారు. రవాణా సౌకర్యాలు మెరు గుపడటంతో పాటు పర్యాటకం అభివృద్ధి చెందుతుం దని, నాసిక్ అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా ఎది గేందుకు ఈ ప్రాజెక్టులు తోడ్పడతాయని అయన పేర్కొ న్నారు. మొత్తంగా 2027 సింహస్థ కుంభమేళా ఆధ్యా త్మిక వేడుకగానే కాకుండా.. ఉత్తర మహారాష్ట్రలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కీలక మలుపుగా నిలవనుంది.

ఎంపీటీసీ / జెడ్పీటీసీ కౌంటింగ్ కేంద్రాల వద్ద ముందస్తు భద్రతా చర్యలు పటిష్టంగా చేపట్టాలి

- భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేసిన జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి
- సుమారు 400 మంది పోలీస్ అధికారులు,సిబ్బందితో కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు : జిల్లా ఎస్పీ

ఉదయం ప్రతినిధి – పార్వతీపురం



వీూజ, ూజ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సుమారు 400 మంది పోలీస్ అధికారులు,సిబ్బందితో కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్టు జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి, తెలిపారు. పార్వతీపురం పట్టణం లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉల్లిభద్ర గ్రామంలో లోని ఉద్యానవన కళాశాల, పాలకొండ బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాలూరు పట్టణంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల వద్ద తీసుకోవలిసిన ముందస్తు భద్రత చర్యలు పట్ల లిజిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, లి అధికారులకు దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద చేపట్టాల్సిన భద్రతా చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రాల భవనాలు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పరిసర ప్రాంతాలను ముందుగానే పరిశీలించి భద్రతాపరమైన లోపాలను గుర్తించి సరిచేయాలి కౌంటింగ్ కేంద్రాల వద్ద అవసరమైన పోలీస్ సిబ్బందిని నియమించి, లోపల మరియు బయట పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి. కౌంటింగ్ కేంద్రాల వద్ద రద్దీ నియంత్రణకు బారికేడ్లు ఏర్పాటు చేసి, అనధికార వ్యక్తులు లోపలికి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలి. ఎన్నికల అధికారులు అనుమతించిన సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లను మాత్రమే నిబంధనల ప్రకారం గుర్తింపు కార్డులు, అనుమతి పత్రాలు పరిశీలించి లోపలికి అనుమతించాలి. కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, పరిసర ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాల పనితీరును ముందుగానే తనిఖీ చేసి నిరంతర పర్యవేక్షణ ఉండేలా మరియు డ్రోన్లతో చుట్టుపక్కల పరిసీలించేలా చూడాలి.

కౌంటింగ్ కేంద్రాల సమీపంలో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించి, అత్యవసర వాహనాలకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలి. గతంలో ఎన్నికల సమయంలో ఘర్షణలు లేదా ఉద్రిక్తతలు చోటుచేసుకున్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి. కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలు, ప్రధాన రహదారులు, సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ మొబైల్ బృందాలతో నిరంతర గస్తీ నిర్వహించాలి. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి చట్టప్రకారం ముందస్తు చర్యలు చేపట్టాలి. ఎలాంటి గొడవలు, ఘర్షణలకు అవకాశం లేకుండా అప్రమత్తంగా ఉండాలి. కౌంటింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చడం, ప్రత్యర్థులపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు, గుంపులుగా చేరి ఘర్షణలకు పాల్పడటం వంటి చర్యలు జరగకుండా ఎన్నికల నిబంధనలు, అమల్లో ఉన్న ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవాలి. కౌంటింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బంది ఎన్నికల అధికారులతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలి. ఏదైనా అవాంఛనీయ ఘటన చోటుచేసుకున్నప్పుడు వెంటనే స్పందించేలా ప్రత్యేక పోలీస్ బృందాలను సిద్ధంగా ఉంచాలి. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని, భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

పార్వతీపురం కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి : డీఆర్డీఏ పీడీ ప్రభావతి



ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

మండలానికి సంబంధించి ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు మరియు నిర్వహణపై డీఆర్డీఏ పీడీ ప్రభావతి కీలక వివరాలు వెల్లడించారు. పార్వతీపురం మండలంలో మొత్తం 17 సెగ్మెంట్లు ఉండగా, ఎంపీటీసీ మరియు జెడ్పీటీసీ స్థానాల కౌంటింగ్ ఒకేసారి చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కౌంటింగ్ ప్రక్రియను రెండు విడతల్లో పూర్తి చేయనున్నట్లు ఆమె వివరించారు. మొదటి విడతలో 9 సెగ్మెంట్లు, రెండవ విడతలో మిగిలిన 8 సెగ్మెంట్ల కౌంటింగ్ నిర్వహించనున్నారు. ప్రతి సెగ్మెంట్ లెక్కింపు పూర్తయిన వెంటనే ఆన్-స్పాట్‌లోనే ఫలితాలను అధికారికంగా ప్రకటిస్తారు. కౌంటింగ్ విధులకు సంబంధించి రిజర్వ్ స్టాఫ్‌తో కలిపి మొత్తం 88 మంది సిబ్బందిని కేటాయించారు. కౌంటింగ్ సూపర్వైజర్లు, అసిస్టెంట్ కౌంటింగ్ సూపర్వైజర్లు మరియు అసిస్టెంట్లకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. సిబ్బందికి ప్రాక్టికల్ అవగాహన కల్పించడం కోసం కౌంటింగ్ హాల్‌లోనే ఇద్దరు మాస్టర్ ట్రైనర్ల ద్వారా ప్రత్యక్ష శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రేపు ఉదయం 7:00 గంటలకే కౌంటింగ్ ప్రారంభమవుతుందని, సిబ్బంది అందరూ తమ ఐడీ కార్డులతో సమయానికి హాజరుకావాలని స్పష్టం చేశారు. పార్వతీపురం జీసీ సెంటర్‌లో ఎంటైర్ నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ జరుగుతున్నందున, సమాచార ప్రసారం కోసం ప్రత్యేకంగా మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే ఫలితాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేలా లైవ్ స్ట్రీమింగ్‌తో పాటు సెగ్మెంట్ల వారీగా ఫలితాలను ప్రదర్శించడానికి ప్రత్యేక డిస్ప్లే బోర్డులను సిద్ధం చేశామని డీఆర్డీఏ పీడీ ప్రభావతి వెల్లడించారు.

అగ్రిగోల్డ్ బాధితులకు అండగా ఉంటాం.. బాధితుల చివరి పైసా అందే వరకు పోరాటం కొనసాగిస్తాం

అగ్రిగోల్డ్ బాధితుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఈ.వి నాయుడు



ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగే వరకు అసోసియేషన్ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడవద్దని రాష్ట్ర అధ్యక్షుడు ఈ.వి. నాయుడు భరోసా ఇచ్చారు. పార్వతీపురం రైతుబజార్ సమీపంలోని రిటైర్డ్ ఎంప్లాయీస్ సంఘ భవనంలో శుక్రవారం అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం జిల్లా అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు ఈ.వి. నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయసింహ, రాష్ట్ర మహిళా కార్యదర్శి ఆరెలమ్మ, జిల్లా గౌరవాధ్యక్షుడు ఆర్వీఎస్ కుమార్, బొబ్బిలి బ్రాంచ్ అధ్యక్షుడు పి. ఈశ్వర నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గత 13 ఏళ్లుగా శాంతియుత పోరాటాలు నిర్వహిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తున్నామని తెలిపారు. పోలీస్ స్టేషన్లలో బాండ్ల వెరిఫికేషన్, మృతిచెందిన బాధితుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, రూ.10 వేలు, రూ.20 వేలు డిపాజిట్ చేసిన బాధితులకు చెల్లింపులు జరిగేలా పోరాటం చేశామని వివరించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఈ.వి. నాయుడు మాట్లాడుతూ గత నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 17 కేంద్రాల్లో అగ్రిగోల్డ్ బాండ్ల వెరిఫికేషన్ జరుగుతోందన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని మండలాల వారీగా బాధితులను విడతలవారీగా పిలుస్తారని తెలిపారు. పిలుపు వచ్చిన బాధితులు మాత్రమే తమ ఒరిజినల్ బాండ్‌తో పాటు, సంతకం చేసిన కలర్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫోటో తీసుకెళ్లాలని సూచించారు. ఉత్తరాంధ్రలోని అనకాపల్లి, పార్వతీపురం, పలాస ప్రాంతాల్లో బాండ్ వెరిఫికేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఇప్పటికే విశాఖపట్నం సిఐడి అధికారులకు వినతిపత్రం అందజేశామని వెల్లడించారు. ఇప్పటివరకు జరిగిన పరిణామాలను వివరించి బాధితుల సందేహాలను నివృత్తి చేశారు. రాష్ట్ర కమిటీ ఇచ్చే ప్రతి పిలుపునకు బాధితులు సమైక్యంగా స్పందించి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సాలాపు అనంతరావు, నాయకులు మురళి డాక్టర్, ఆర్. ఆదినారాయణ, బిటిఆర్ నాయుడు, సాయిరాంతో పాటు అధిక సంఖ్యలో అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

కురుపాంలో గిరిజన విద్యార్థినులకు అస్వస్థత

సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పరామర్శించిన టీడీపీ నేత వీరేష్ చంద్రదేవ్!



ఉదయం ప్రతినిధి – కురుపాం

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ పాఠశాల (గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల) లో తీవ్ర కలకలం రేగింది. పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థినులు ఈరోజు అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వైరచర్ల వీరేష్ చంద్రదేవ్ తక్షణమే స్పందించి బాధితులను పరామర్శించారు.

హాస్పిటల్‌లో విద్యార్థినుల పరామర్శ.. వైద్యులతో సమీక్ష

విద్యార్థినులు అస్వస్థతకు గురికావడంతో వారిని చికిత్స నిమిత్తం కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి (జఒజ) తరలించారు. విషయం తెలియగానే హాస్పిటల్‌కు చేరుకున్న వీరేష్ చంద్రదేవ్ చికిత్స పొందుతున్న విద్యార్థినులను వ్యక్తిగతంగా కలిసి, ధైర్యం చెప్పారు. అనంతరం అక్కడి డ్యూటీ వైద్యులతో మాట్లాడి విద్యార్థినుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైతే జిల్లా కేంద్ర ఆసుపత్రి నిపుణులతో మాట్లాడాలని వైద్యులను కోరారు.

పాఠశాలలో ప్రత్యక్ష పరిశీలన.. ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం

హాస్పిటల్ సందర్శన అనంతరం వీరేష్ చంద్రదేవ్ నేరుగా గిరిజన సంక్షేమ పాఠశాలకు వెళ్లారు. అక్కడ గదులు, తాగునీటి వసతి మరియు వంటశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థినులు అస్వస్థతకు గురికావడానికి గల కారణాలపై పాఠశాల ప్రిన్సిపాల్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిరుపేద గిరిజన విద్యార్థుల ఆరోగ్య విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని, భోజనం మరియు తాగునీటి నాణ్యతపై నిరంతరం నిఘా ఉంచాలని హెచ్చరించారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు పూర్తి స్థాయి విచారణ జరిపి లోపాలను సరిదిద్దాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీరేష్ చంద్రదేవ్ వారితో పాటు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్స్‌ల్లో భద్రం

- మరికొన్ని గంటల్లో జాతకాలు వెల్లడి
- కూడికలు,తీసివేతలు, గణంకాలతో అభ్యర్థుల టెన్షన్

ఉదయం ప్రతినిధి – విజయనగరం

పరిషత్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేటి ఉదయం 8 గంటలనుంచి ప్రారంభం కానుంది. బ్యాలెట్ బాక్స్‌ల్లో అభ్యర్థుల జాతకాలు నిక్షిప్తమై ఉన్నాయి. గెలుపు పై ఎవరికివారు తీసివేతలు, కూడికలుతో లెక్కలు వేసు కుంటు అభ్యర్థులందరూ టెన్షన్‌తో గడుపుతున్నారు. అధికార కూటమి పార్టీకి చెందిన అభ్యర్థుల్లో కొంత మంది గెలుపు ధీమాతో ఉన్నారు.జిల్లా ప్రజానీకం మాత్రం ప్రధానంగా జిల్లా పరిషత్ ఫలితాల పై దృష్టి సారించారు. కూటమికి మెజారిటీ లభించిన పక్షంలో జడ్పీ ఛైర్మెన్ పదవి రేసులో నలుగురు అభ్యర్థులు రెడీగా ఉన్నారు. వీరిలో మాజీ మంత్రి,చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు కోడలు గరివిడి నుంచి జడ్పీటిసి గా పోటీలో ఉన్నారు. తెదేపా సీనియర్ నేత కంది చంద్రశేఖర్ భార్య కూడా డెంకాడ జడ్పీటిసిగా బరిలో నిలిచారు.మరో సీనియర్ నేత కర్రోతు బంగార్రాజు తన కుమార్తెను భోగాపురం జడ్పిటిసిగా పోటీలో నిలిపారు. ఇంకోపక్క గతనెలలో వైకాపా కు రాజీనామా చేసి తేదేపాలో చేరిన జడ్పీ మాజీ ఛైర్మెన్ చిన్న శీను కూడ తన కుమార్తె సిరిసాహస్ర ను తెర్లాం బరిలో నిలిపారు. మరి ఈ నలుగురిలో ఎవరికి జడ్పీ పీఠం దక్కనుందో అనే ఉత్కంఠ అందరిలో ఉంది. అలాగే వైకాపా కు మెజారిటీ స్థానాలు దక్కితే మాజీమంత్రి,శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ కుమార్తే ఒక్కరే జడ్పీ పీఠం ఆశిస్తున్నారు. మరి నేటి ఫలితాలు ఎవరికి అనుకూలంగా వస్తాయో అనే సస్పెన్స్ కు మరికొద్ది గంటల్లో తెరపడనుంది.

బాణసంచా నిల్వలు, తయారీ, విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్

ఉదయం ప్రతినిధి – విజయనగరం

దీపావళి పండుగ వస్తున్న నేపథ్యంలో బాణసంచా ప్రేలుళ్ళు, ప్రమాదాలు జరగకుండా బాణసంచా నిల్వ ఉంచే గోడౌన్లు, విక్రయించే లైసెన్సు షాపులు, తాత్కాలిక బాణసంచా విక్రయ షాపుల వద్ద వ్యాపారులు తప్పనిసరిగా ముందస్తు జాగ్రత్తలు, రక్షణ చర్యలు చేపట్టే విధంగా తనిఖీలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు. బాణసంచా విక్రయించేందుకు విక్రయ దారులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుండి తాత్కాలిక అనుమతులు పొందాలన్నారు. తాత్కాలికంగా బాణసంచా విక్రయాలు చేపట్టే వ్యాపారులు తమ షాపులను నివాస ప్రాంతాలకు, ఆసుపత్రులకు దూరంగా ఉండే విధంగాను, పట్టణ, గ్రామ శివార్లలోని బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే ఏర్పాటుచేయాలన్నారు. ప్రమాదాల నియంత్రణకు షాపుల మధ్య తప్పనిసరిగా 15 మీటర్ల నిర్దిష్ట దూరం ఉండాలన్నారు.అనుమతులు లేకుండా విక్రయించే షాపులపై కఠినమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

ఏపిటిడబ్ల్యూఆర్ఎస్, యుఆర్జేసీ శివన్నపేటలో జ్వరాల పరిస్థితి పూర్తిగా అదుపులో ఉంది

- విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు, ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు
- జ్వరాలపై అప్రమత్తం.. గురుకులంలో ప్రత్యేక వైద్య శిబిరం
- శివన్నపేట గురుకులంలో వైద్య బృందాల నిరంతర పర్యవేక్షణ
- 71 మంది విద్యార్థులకు జ్వర లక్షణాలు.. పరిస్థితి నిలకడగా ఉందిలి
- జిల్లా కలెక్టర్ డా ఎన్ ప్రభాకర రెడ్డి

ఉదయం ప్రతినిధి – కురుపాం



కురుపాం మండలం శివన్నపేటలోని ఏపిటిడబ్ల్యూఆర్ఎస్, యుఆర్జేసీ వసతి పాఠశాలలో విద్యార్థులకు జ్వరాలు, జలుబు, దగ్గు లక్షణాలు కనిపించిన నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమై ప్రత్యేక వైద్య చర్యలు చేపట్టిందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. పాఠశాలలో మొత్తం 559 మంది విద్యార్థులకు గాను 516 మంది హాజరయ్యారని, హాజరైన విద్యార్థులందరికీ ర్యాపిడ్ డయాగ్నస్టిక్ పరీక్షలు నిర్వహించగా ఒకరికి మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని, మిగిలిన 515 మందికి నెగిటివ్‌గా వచ్చిందని తెలిపారు. మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ అయిన 10 సంవత్సరాల ఐదో తరగతి విద్యార్థిని ఆరోగ్యం నిలకడగా ఉందని పేర్కొన్నారు. నవంబర్ 3 నుంచి 6వ తేదీ వరకు మొత్తం 71 మంది విద్యార్థుల్లో జ్వరం, జలుబు, దగ్గు లక్షణాలు గుర్తించగా, ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం కురుపాం సీహెచ్‌సీకి తరలించామని, ప్రస్తుతం వారంతా నిలకడగా ఉన్నారని తెలిపారు. మరో 30 మంది విద్యార్థులు పూర్తిగా కోలుకున్నారని, ప్రస్తుతం 38 మంది విద్యార్థులు ప్రత్యేక వైద్య పర్యవేక్షణలో ఉన్నారని వివరించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పాఠశాలలో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేసి, ఒక్కో వార్డులో 15 నుంచి 20 మంది విద్యార్థులకు మాత్రమే వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. అనారోగ్యంతో ఉన్న విద్యార్థులకు ప్రత్యేకంగా బ్రెడ్, పాలు, ఓఆర్ఎస్ ద్రావణం అందిస్తున్నారని, వైద్యుల సూచనల మేరకు ఇతర జాగ్రత్తలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రత్యేక మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేయడంతో పాటు ఆరోగ్యంగా ఉన్న విద్యార్థులతో అనారోగ్యంతో ఉన్న విద్యార్థులు కలవకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇద్దరు చిన్నపిల్లల వైద్య నిపుణులు, ఒక జనరల్ ఫిజీషియన్, ఇద్దరు వైద్యాధికారులు, డిప్యూటీ డీఎంహెచ్ఓ, ఐటీడీఏ అధికారులు, ఇతర వైద్య సిబ్బంది విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్ నిపుణులతో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే పాఠశాలలోని మూడు నీటి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించామని, ఫలితాలు రావాల్సి ఉందని తెలిపారు. రెండు ఆర్వో ప్లాంట్లు ఉండగా, ఒకటి మరమ్మతులో ఉందని, విద్యార్థులకు కాచి చల్లార్చిన నీటిని సరఫరా చేస్తున్నారని వివరించారు. వంటశాల, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వైద్య నిపుణుల ప్రాథమిక అభిప్రాయం ప్రకారం, తుపాను అనంతర పరిస్థితుల్లో గాలి ద్వారా వ్యాపించే వైరల్ ఇన్ఫెక్షన్లు జ్వరాలకు కారణమై ఉండవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. అయితే దీనిపై మరింత స్పష్టత కోసం వైద్య పరీక్షలు, రక్త నమూనాల నివేదికలు పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని గురుకుల, సంక్షేమ వసతి పాఠశాలల్లోనూ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, పరిస్థితిని గంటగంటకూ పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు.

Owner,Editor, Publisher : SIVA SANKARA VENKATA PRASADA RAO PALLA, Published from H.NO: 1-19-17, BC COLONY, AGRAHARAM, VIZIANAGARAM, ANDHRA PRADESH - 535004. Printed at NALIVELI EXPRESS, MAIN ROAD, PATTIKONDA , KURNOOL, ANDHRA PRADESH - 518380.
Editor : SIVA SANKARA VENKATA PRASADA RAO PALLA. Registration Number : APTEL/26/A5462